క్లుప్తంగా

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కడియం: స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టు ఇంటర్మీడియెట్ విద్యార్థిని జ్యోతుల ఉమామహేశ్వరి బైపీసీలో 954 మార్కులు సాధించి, కాలేజీలో ప్రథమ స్థానంలో నిలిచింది. అయితే ఆమె కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, తోటి ఉపాధ్యాయులతో కలిసి రూ. 20 వేలు ఆర్థిక సాయంగా సోమవారం అందజేశారు. హెచ్ఎం టి.సత్యనారాయణ, సూరిబాబు, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటదుర్గ, శ్రీనివాస్, చంద్రశేఖర్, సత్యనాగమణి, కోటేశ్వరి, జి.సత్యనారాయణ సాయం అందించిన వారిలో ఉన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

కడియం: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈ మేరకు అవగాహన సమావేశం నిర్వహించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధి, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో రమేష్, ఐసీడీఎస్ ఏసీడీపీవో టి.కనకవల్లి, బాలల పరిరక్షణ విభాగం అధికారి క్రాంతి లాల్, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ బిరాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులు

ప్రకాశం నగర్: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో లారెల్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ప్రతిభ చూపారు. మహ్మద్ యూసఫ్ 493, సాయి సూర్య దినేష్ 784 ర్యాంకులు సాధించారు. ఈ విషయాన్ని ఆ స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్కూల్ ఆవరణలో ర్యాంకర్లను అభినందించారు. రవికుమార్ మాట్లాడుతూ వెయ్యి లోపు రెండు, మూడు వేల లోపు ఐదు, ఆరువేల లోపు తొమ్మిది ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుంకర మల్లికార్జున్, బి.గురునాథ్ పాల్గొన్నారు.

హుండీ దొంగతనంపై కేసు

కంబాలచెరువు: హుండీ దొంగతనంపై మూడో పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కాతేరులోని కాశీ అన్నపూర్ణేశ్వర శివాలయంలోని హుండీలో రూ.15 వేలను మార్చిలో గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిపోయారు. ఇటీవల వరస హుండీ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో తమ గుడిలోనూ అదే తరహాలో జరిగి ఉంటుందని భావించి ఆలయ కమిటీ మెంబర్ కాకినాడ ఉమామహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ: ఇటీవల తమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూలే, అంబేడ్కర్ పురస్కారాల కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. గత నెలలో చెరుకూరి గార్డెన్స్‌లో రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే అంబేడ్కర్ పేరిట మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, దళిత సేన అధ్యక్షుడు జేబీ రాజుకు పురస్కారాలు ప్రదానం చేసిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే కలిసిన వారిలో సంఘ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్‌పీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బి.జార్జి ఆంటోని, జిల్లా ఉపాధ్యక్షుడు పోలవరపు రాము ఉన్నారు.

రేపు బాబా మందిర వార్షికోత్సవం

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా మందిర 23వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేద పండితుడు దీక్షితులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం 8.30కు అఖండ బిల్వార్చన ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.



అన్నపూర్ణమ్మపేటలో క్యూలో వేచి ఉన్న రేషన్ లబ్ధిదారులు

రేషన్ కష్టాలు షురూ..

రేషన్ లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. సరకులు తీసుకునేందుకు షాపుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు షాపుల వద్దకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల సమయానికి షాపులు తెరవలేదు. మరికొన్నిచోట్ల సర్వర్ పనిచేయడం పోవడంతో గంటల తరబడి పడిగాపులు పడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేషన్ సరకులను లబ్ధిదారుల ఇంటికే ఇచ్చేలా ఏర్పాటు చేశారు. మొబైల్ డిస్పెన్సరీ యూనిట్లు (ఎండీయూ) ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే సరకులు చేరేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. జూన్ నుంచి రేషన్ షాపుల వద్దే సరకులు పంపిణీ చేయాలని ఆదేశించింది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని పలు రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను సోమవారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– రాజమహేంద్రవరం సిటీ



రాజేంద్రనగర్‌లో సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు రేషన్ షాపు పక్కనే పడిగాపులు కాస్తున్న మహిళలు



రాజేంద్రనగరంలో సాయంత్రం ఐదు గంటలకు షాపు తెరిచిన తర్వాత సర్వర్ పనిచేయకపోవడంతో వేచిఉన్న మహిళలు



నారాయణపురంలో సర్వర్ పనిచేయకపోవడంతో తప్పని అవస్థలు

ఎమ్మెల్యే లేకపోతే రేషన్ షాపులు మూసేస్తారా!

- రాజమహేంద్రవరం ఆయన సొంత జాగీరా!
- ఎమ్మెల్యే వాసు తీరు దారుణం
- రేషన్ షాపుల వద్ద ప్రజల ఇక్కట్లు
- ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు సరికాదు
- వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): 'రాష్ట్రమంతటా జూన్ ఒకటో తేదీన రేషన్ షాపులు తెరిచి ఉంటే, ఒక్క రాజమహేంద్రవరం సిటీలో మాత్రం తెరవలేదు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తన కుమారుడి పుట్టినరోజు వేడుకలకు హైదరాబాద్ వెళ్లడమే దీనికి కారణం' అని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 4న నిర్వహించే వెన్నుపోటు దినోత్సవ పోస్టర్‌ను సోమవారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం భరత్ రామ్ మాట్లాడుతూ ఆదిరెడ్డి వాసు సొంత జాగీరులా రాజమహేంద్రవరం సిటీ మారిందన్నారు. ఆయన ఊరిలో లేకపోతే రేషన్ షాపులు తెరవడం పోవడం దారుణమన్నారు. డిప్యూటీ సీఎం ఇలాఖాలో మంత్రి ఎక్కడ నుంచో వచ్చి రేషన్ షాపులను ప్రారంభిస్తే, రాజమహేంద్రవరంలో మూసివేయించారన్నారు. ఎండీయూ ఆపరేటర్లతో చేసుకున్న ఒప్పందం ఇంకా రెండేళ్లు ఉన్నప్పటికీ రద్దు చేసి, సరకుల కోసం రేషన్ షాపుల దగ్గరకే రమ్మనడం శోచనీయమన్నారు. రేషన్ షాపుల దగ్గర ప్రజలు ఏ విధంగా ఇక్కట్లకు గురవుతున్నారో ఒకసారి గమనించాలని క్లిప్పింగులను ప్రదర్శించారు.



వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్ తదితరులు

మద్యం షాపులో పర్మిట్ రూమ్‌లు

మద్యం షాపుల మాటున పర్మిట్ లేని రూములు ఏర్పాటు చేసి, తాగిస్తున్నారని భరత్ విమర్శించారు. తాడితోట తదితర ప్రాంతాల్లో మద్యం షాపుల పక్కన భాగోతం అంటూ ఆయన క్లిప్పింగులను చూపించారు. ఇక్కడే కాకుండా రాష్ట్రంలో ఇలా 60 వేల బెల్ట్ షాపులున్నాయన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా యువతను మద్యం మత్తులో ఉంచుతున్నారని భరత్ అన్నారు. నగరంలో పర్మిట్ లేని మద్యం రూములను మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులను డిమాండ్ చేశారు. లేకుంటే తామే వెళ్లి బంద్ చేయిస్తామని హెచ్చరించారు.

సూపర్ సిక్స్ హామీల మాటేమిటి!

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊదరగొట్టిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని మాజీ ఎంపీ భరత్ రామ్ ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా వాటిని అమలు చేయకపోవడంతో ఏ వర్గం ప్రజలూ సంతోషంగా లేరన్నారు. ప్రజలను నమ్మించి, వంచించి అధికార పీఠం ఎక్కారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుకు నిరసనగా ఈ నెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు గురుమూర్తిరెడ్డి సోమవారం సాయంత్రం మాజీ ఎంపీ, పార్టీ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్‌ను కలుసుకున్నారు. తన నివాసానికి వచ్చిన గురుమూర్తిరెడ్డిని భరత్ రామ్ శాలువా కప్పి, మొక్క అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చని నేపథ్యంలో నిరసనగా బుధవారం తలపెట్టిన వెన్నుపోటుదినం విజయవంతం గురించి చర్చించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కానుబోయిన సాగర్, నాయకులు మార్గాన రాము, మారిశెట్టి వెంకన్న, ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.



గురుమూర్తిరెడ్డిని సత్కరించి మొక్క అందజేస్తున్న భరత్ రామ్

విద్యార్థులకు పోటీలు



క్రాఫ్ట్ పోటీలలో విద్యార్థులు తయారు చేసిన బొమ్మలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్రాఫ్ట్ టీచర్ మిడతాని శ్రీలలితా కళ్యాణిరెడ్డి ఆధ్వర్యంలో క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తక పఠనం, లలిత సంగీతం, భగవద్గీత తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

ప్రకాశం నగర్: 11 కేవీ సుబ్బారావు నగర్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు సంబంధించిన 11 కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ సమయంలో పీఅండ్‌టీ కాలనీ, 5వ నంబర్ బస్టాప్, సుబ్బారావు నగర్, జాన్ వెస్లీ చేర్చి, టీవీ రోడ్డు ఆర్చ్, సారంగధరమెట్ట, ఎంఎస్ఎన్ నగర్, ఆనంద్ నగర్ డౌన్, క్వారీ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చి సంబరాలు చేసుకోండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రకాశం నగర్: కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, సుపరిపాలన సంబరాలు చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. సోమవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 23ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. సుమారు 1200 మంది ఇళ్ల స్థలాల అర్జీలను కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

రాజానగరం: పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయనే మనస్తాపంతో ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. ఇక్కడకు సమీపంలో ఒక ఇంజినీరింగ్ కళాశాలలో నెల్లూరు జిల్లా నర్సాపురం మండలం గుడ్లూరుకు చెందిన పరుచూరి ప్రగతి (19) బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. కాలేజీ హాస్టల్‌లోనే ఉంటోంది. మొదటి సెమిస్టర్ పరీక్షలలో నాలుగు పరీక్షలలో ఫెయిలవడం ఆమెను మానసిక వేదనకు గురిచేసింది. వేసవి సెలవులకు ఇంటివెళ్లిన ఆమె సోమవారం నుంచి సెకండ్ సెమిస్టర్ పరీక్షలు కావడంతో ఆదివారమే తిరిగి వచ్చింది. అయితే రూమ్ మేట్స్ (వారంతా సెకండియర్ విద్యార్థినులు) మాత్రం ఇంకా తిరిగి రాకపోవడంతో ఒక్కతే హాస్టల్ ఉంది. ఫస్ట్ సెమిస్టర్ పూర్తి చేయకుండా సెకండ్ సెమిస్టర్ పరీక్షలకు వెళ్లడంతో మానసిక ఆందోళనకు గురైంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు జాగ్రత్తలు చెపుతూ లేఖ రాసి, తాను ఉంటున్న హాస్టల్ గదిలోనే సున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించామని, కేసు దర్యాప్తులో ఉందని స్థానిక సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

యోగాసనాలతో రుగ్మతలు దూరం



యోగాసనాలు వేస్తున్న డీఆర్ఓ సీతారామమూర్తి తదితరులు

సీటీఆర్ఐ: ప్రతి రోజూ యోగాసనాలు వేయడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి అన్నారు. ఆర్ట్స్ కళాశాల సమీపంలో గ్రాండ్ ట్రంక్ రహదారిపై రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం 8వ రోజు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజల్లో యోగా సాధనపై స్వీయ ఆసక్తి కలిగించేలా కలెక్టర్ పి.ప్రశాంతి మార్గదర్శకత్వంలో చక్కటి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ రవాణా రంగంలో ఉన్న లారీ, బస్సు డ్రైవర్, ఆటో డ్రైవర్లు, డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు, ఆటో మొబైల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర అనుబంధ రంగాలకు చెందిన సుమారు 1200 మందికిపై ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

ప్రతి అర్జీనీ పరిష్కరించాల్సిందే..

సీటీఆర్ఐ: పీజీఆర్ఎస్‌లో స్వీకరించే ప్రతి అర్జీని పరిష్కరించాలని కమిషనర్ కేతన్ గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 25 అర్జీలు అందాయి. అర్జీదారులు తెలియజేసిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా ప్రతిఒక్క సమస్యను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఎంహెచ్ఓ వినూత్న పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్

దళితుల దారిని పునరుద్ధరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీఆర్‌సీఎస్ సభ్యులు

సీటీఆర్ఐ: దళితుల దారిని పునరుద్ధరించాలని, దాన్ని మూసివేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ప్రకారం కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజబాబు మాట్లాడుతూ రంగంపేట మండలం ఈలకొలను రెవెన్యూ గ్రామ పరిధిలోని అచ్యుతాపురం చివర గల కొత్తపేట కాలనీలో సుమారు 100 కుటుంబాలు దళితులు, ఇతర పేదలు జీవిస్తున్నారన్నారు. వీరు ఎన్నో ఏళ్లుగా రాకపోకలు సాగిస్తున్న కొత్తపేట నుంచి బొట్టు గొయ్యి పుంతకు చేర్చే దారి మార్గాన్ని సరిహద్దు రైతు అక్రమ మార్గంలో కంచి వేసి మూసివేశారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఆ కాలనీ వాసులు ఎవరైనా చనిపోతే ఊరిలోంచి తీసుకెళ్లనివ్వరని, ఏదైనా ప్రమాదాలు జరిగితే అంబులెన్స్, ఫైరింజన్ రావడానికి సరైన మార్గం లేదన్నారు. దీంతో కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్టీయూ ఉమ్మడి అధ్యక్షుడు కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ ప్రారంభం



కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాకులో ఇంటెన్సిఫైడ్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్‌ను సోమవారం జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర ప్రారంభించారు. టీబీ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నవారిని గుర్తించి, టీబీ స్క్రీనింగ్, కఫ్లె పరీక్ష చేయడంతో పాటు ఎక్స్‌రేకు రిఫర్ చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆమె తెలిపారు. ఎవరి కైనా టీబీ నిర్ధారణ అయితే వెంటనే చికిత్స ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో సుమారు వంద రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం ఒక బాధితురాలికి పోషకాహార కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన కల్పించాలి

కడియం: క్షయను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలకు మరింత అవగాహన పెంచాలని మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి సత్యప్రసాద్ సూచించారు. కడియం, కడియపులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన టీబీ ముక్తి అభియాన్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించాలన్నారు. టీబీ సోకిన వారికి తమ వంతు సాయం అందిస్తామని ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, వైద్యాధికారులు మణిజ్యోత్స్న, నాగసాయిమౌర్య, టీబీ సూపర్‌వైజర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది

అనపర్తి: స్థానిక బాలుర హైస్కూల్లో సోమవారం మధ్యాహ్న భోజన పథకం కుక్ కం హెల్పర్లకు శిక్షణ నిర్వహించారు. దీనికి మండలంలోని 42 పాఠశాలల చెందిన 92 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్సు డైరెక్టర్ ఎంఈవో ఎస్.సత్తిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభానికి ఒక్క రోజు ముందే సిబ్బంది వెళ్లి, అక్కడి సామగ్రిని శుభ్రం చేసుకోవాలన్నారు. వాటర్ ట్యాంక్‌ను క్లీన్ చేయించి ఆరబెట్టి స్వచ్ఛమైన నీటిని నింపాలన్నారు. జిల్లా ఎండీఎం కో ఆర్డినేటర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ ఎండీఎం బిల్లులు సకాలంలో పంపించడంలో అనపర్తి మండలం మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎండీఎం స్టేట్ రిసోర్స్ పర్సన్ కృష్ణవేణి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సురేంద్రకుమారి, పాఠశాల హెచ్ఎం వెంకటరెడ్డి, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాల పెంపు కోసమే శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సుభాషిణి

రాజానగరం: విద్యాబోధనలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. అందుకోసమే ఉపాధ్యాయులకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. తూర్పుగానుగూడెంలోని ఐఎస్టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మండల రిసోర్స్ పర్సన్లకు 'టీచ్ ఎట్ ద రైట్ లెవెల్ (తరల్), ఎస్‌సీఈఆర్‌టీ' అంశాలపై మూడు రోజులు ఇచ్చే శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో అమలవుతున్న అభ్యసన ప్రక్రియలు, ఎస్‌సీఈఆర్‌టీ అంశాలపై ప్రత్యేక మానిటరింగ్ ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన స్టేట్ రిసోర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ తరగతులు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన మండల రిసోర్స్‌పర్సన్లు అనంతరం తమ మండలాలకు వెళ్లి అక్కడ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు అమ్మి నాయుడు, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డి.గౌరీశంకరరావు పాల్గొన్నారు.